> **''పరిమళా.. మనం ఒకటి కావటానికి ఇన్నిరోజుల సమయం తీసుకుంది. ముందు నాకు ఓ విషయంలో నీ వివరణ కావాలి. నా గురించి నీ అభిప్రాయం ఏమిటి? పెళ్లి జరిగినప్పటి నుంచి నువ్వు ఎందుకంతగా అదోలా ఉంటున్నావు. నేనంటే ఇష్టం లేకపోయినా, మరేదో కారణం ఉన్నా చెప్పు. మనం స్నేహితుల్లా విడిపోదాం'' అన్నాడు అనంత్. పరిమళకు మళ్లీ ఎక్కడో అనుమానం. ''మాట్లాడు పరిమళా!'' అన్నాడు అనంత్.**

అనంత్ వెళ్లాక పరిమళ అనుకుంది!

'ఏం చెబుతాడు. లాస్య అన్నట్లు నేను..'

పరిమళ బాధగా కళ్లు మూసుకుంది.

* * *

పరిమళ బెంగళూరుకు వచ్చింది. బిజీ షెడ్యూల్‌లోనూ తనకోసం ఒక రోజును కేటాయించింది లాస్య.

ఇప్పుడు లాస్య గదిలో వారిద్దరూ ఎదురెదురుగా ఉన్నారు.

''అయ్యిందా శోభనం?'' అదోలా అంది లాస్య.

''కాలేదు'' ముభావంగా చెప్పింది పరిమళ.

''అందుకే ముందుగానే హెచ్చరించాను. అఫ్‌కోర్స్.. అది చివరి నిముషంలో! నువ్వే ధైర్యం చేయలేకపోయావు. ఇప్పుడేం చేయాలనుకుంటున్నావు?'' అడిగింది లాస్య.

''నేనింకా అతన్ని 'గే' అనో, 'నపుంసకుడు' అనో కన్‌ఫర్మ్ చేయలేదు''

''సో..'' అంది లాస్య ముఖం చిట్లించి..

''అసలు ఓ వ్యక్తి గురించి అలాంటి నిర్ణయానికి రావటానికి నీకున్న ఆధారం ఏంటి? అనంత్ నీకు ముందే తెలుసా? పోనీ నీ, నా ఫ్రెండ్స్ సర్కిల్‌లో ఎవరికైనా అనంత్‌తో అంత దగ్గరి పరిచయం ఉందా? నా జీవితం నాశనం అవుతుందని అనుకున్నప్పుడు ఓ అరగంట నాకు ఇవ్వలేకపోయావా! జీవితం అంటే అంత లోకువా?''

లాస్య ముఖం వివర్ణమైంది.

''ఒకవేళ అదే నిజం అనుకుని నువ్వు చెప్పినట్లు చేస్తే.. ఓ మగవాడి జీవితం రోడ్డున పడేది కదా?'' అంది పరిమళ.

''సో.. అనంత్ మగవాడు అంటున్నావు!''

''ఆ తొందరే వద్దంటున్నాను. పెళ్లిపీటల మీద అనంత్ నన్ను చూసి కంగారుపడ్డాడు. అప్పుడు తనకి రెండు రకాల అనుమానాలు వచ్చి ఉంటాయి. మొదటిది.. నేను ఇంకెవరినన్నా ప్రేమించి ఉంటానని. రెండవది నేను కూడా ఓ స్త్రీతో కలిసి బతకవచ్చని!''

''అలా అనుకున్నాడా?''

''మనుషుల ముఖం చూసి ఎవరు 'గే'నో ఎవరు 'లెస్బియనో' చెప్పగలమా? ఇప్పుడు ఇలాంటివారి సంఖ్య పెరుగుతోంది. నీ మాటల్లో అది చట్టబద్ధం కదా!?''

''నన్ను విమర్శించటానికి వచ్చావా?''

''పజిల్ ఇంకా పూర్తి కాలేదు. అనంత్ ఏ రకానికి చెందినవాడో ఇంకా తెలియదు. మా శోభనం ఇంకా జరగలేదు'' అంది పరిమళ.

''అతను వాయిదా వేస్తున్నాడంటే అర్థం కావటం లేదా?'' అంది లాస్య.

''సావధానంగా వినటం నేర్చుకో లాస్యా? మిగతా చర్చ అనవసరం. అనంత్ ఎలాంటి వాడైనా కావచ్చు. అతనిలో నువ్వు చెప్పిన ఏ లక్షణం ఉన్నా.. రేపటి నా జీవితం గురించి నాకో అవగాహన ఉంది''

''ఇప్పుడు నేనేం చేయాలి?''

''అనంత్ మీద నువ్వు చేసిన ఆరోపణలకు నాకు ఆధారాలు చూపించాలి. అవి చెప్పకపోతే నిజంగా నాకు అన్యాయం చేసిన దానివి అవుతావు. ఇంకోమాట కూడా అంటున్నాను. నువ్వు నా అనుకూల శత్రువువి అనుకుంటాను'' అంది పరిమళ.

''పరీ.. నేను చేసింది మంచో చెడో నాకు తెలియదు. అనంత్ నాకు పరిచయంలేని వ్యక్తి. ఆ రోజు అతని ఫొటో చూస్తున్నాను. మీ ఇద్దరికీ శుభాకాంక్షలు పంపాలనుకున్నాను. అప్పుడు నా కొలీగ్ అతని ఫొటోని చూసి అడిగింది. ఎవరితను అని. నా ఫ్రెండ్ పెళ్లి చేసుకోబోతోంది అన్నాను. వెంటనే 'మైగాడ్!' అంది. 'ఇతను నీకు తెలుసా!?' అని అడిగాను. 'హవ్ కెన్ ఐ ఫర్‌గెట్ హిమ్!' అంది. అప్పుడు ఆమె చెప్పిన మాటలు నీకు చెప్పాలి'' అంది లాస్య.

''తర్వాత నువ్వు మాట్లాడలేదా?''

''తను ముంబైలో ఉంటుంది. అక్కడ నుండి రకరకాల పనులు. కాంటాక్ట్ చేయటం కుదరలేదు''

''ఆమె పేరు నాకు కావాలి. తన ఫొటో ఉందా?''

''ఉంది. నీకు పంపిస్తాను. అయినా నువ్వు మాట్లాడవద్దు. నేను మాట్లాడతాను'' అంది లాస్య.

పరిమళ తలూపింది.

* * *

నెలన్నర గడిచిపోయింది.

ఆరోజు శోభనం ఏర్పాటు చేశారు.

ఉద్వేగంతో గదిలోకి అడుగుపెట్టింది పరిమళ.

ఆమె చేతులు అందుకుని మంచంమీద కూర్చోబెట్టాడు అనంత్.

''పరిమళా.. మనం ఒకటి కావటానికి ఇన్నిరోజుల సమయం తీసుకుంది. ముందు నాకు ఓ విషయంలో నీ వివరణ కావాలి. నా గురించి నీ అభిప్రాయం ఏమిటి? పెళ్లి జరిగినప్పటి నుంచి నువ్వు ఎందుకంతగా అదోలా ఉంటున్నావు. నేనంటే ఇష్టం లేకపోయినా, మరేదో కారణం ఉన్నా చెప్పు. మనం స్నేహితుల్లా విడిపోదాం'' అన్నాడు అనంత్.

పరిమళకు మళ్లీ ఎక్కడో అనుమానం.

''మాట్లాడు పరిమళా!'' అన్నాడు అనంత్.

అప్పుడు పరిమళ తన ఫోన్ తీసుకువచ్చి..

''ఈ అమ్మాయి మీకు తెలుసా?'' అంది.

అనంత్.. ఆమెను చూశాడు. అతని ముఖంలో కనిపిస్తున్న మార్పులను గమనిస్తోంది పరిమళ.

''తెలుసు. మరిచిపోవటం కష్టమే!'' అని ఫోన్ పక్కన పెట్టాడు.

''ఈమె, మరో స్నేహితురాలు, నేనూ కలిసి ఓ గదిలో ఆ రాత్రి ఉండాల్సి వచ్చింది. వాళ్లంతా మోడ్రన్ గాల్స్. అసలు అలాంటి సందర్భం రావటమే చిత్రం. ఓ పని మీద వెళ్లాను. అక్కడ హోటల్ గదులు లేవు. ఎడ్జస్ట్ కావాల్సి వచ్చింది. ఆరోజు ఈమె నన్ను తన కోరిక తీర్చమంది. నేను ఒప్పుకోలేదు. 'ఇందులో తప్పేం ఉంది. ఇది ఫిజికల్ నీడ్ కాదా!?' అంది. నన్ను గాఢంగా హత్తుకుంది. కవ్వించింది. నన్ను నేను నిగ్రహించుకోవటం కష్టమైంది. అప్పుడు నేనే తనతో చెప్పాను.. నేను 'గే' అని''.

ఆ మాటలు వింటూనే పరిమళ కళ్లు పెద్దవయ్యాయి.

''నా దిండు తీసుకుని ఆ గదిలోంచి బయటికి వెళ్లిపోయాను. నేను ఈ తరానికి చెందినవాణ్ని కాకపోవచ్చు. పెళ్లి పట్ల, దాంపత్య జీవితం పట్ల నాకు కొన్ని అభిప్రాయాలు ఉన్నాయి. భార్యాభర్తల అనుబంధం గొప్పది. ఇంకొకరు వారి మధ్యకు రాకూడనిది. పవిత్రమైనది. ఎవరు ఏ రూల్స్ బ్రేక్ చేసినా అది వారిష్టం. నేను ఇంకొకరిని విమర్శించాలనుకోను. 'గే'లు, లెస్బియన్స్, ట్రాన్స్‌జెండర్లు.. అందరూ మనుషులే'' అన్నాడు అనంత్.

పరిమళ అప్పుడు మాట్లాడటం మొదలుపెట్టింది. అనంత్ చిరునవ్వుతో వింటున్నాడు. ఆమె చెప్పటం పూర్తయింది. పరిమళను దగ్గరకు తీసుకున్నాడు.

''నన్ను 'గే' అనే పదమే కాపాడింది. ఇంక 'నపుంసకుడు' అన్న బిరుదుని కూడా వదిలించుకోవాలని అనుకుంటున్నాను నువ్వు సహకరిస్తే'' అన్నాడు చెవిలో.

పరిమళ అతని హృదయం మీద వాలిపోయింది.

రాత్రి కరుగుతూనే ఉంది.

* * *

ఫోన్ అందుకుంది లాస్య.

''లాస్యా.. మా శోభనం దివ్యంగా జరిగిపోయింది. నీ కొలీగ్ కోరుకునే మగాడు అనంత్ కాకపోవచ్చు. కానీ, అతను ఓ మంచి భర్త. భార్యను మాత్రమే ప్రేమించి, తనతోనే జీవితాంతం ప్రయాణం చేయాలనుకునే పాతకాలపు అబ్బాయి. ఐ లవ్ హిమ్'' అని ఫోన్ కట్‌చేసింది పరిమళ. ■

## పి. చంద్రశేఖర అజాద్



పూర్తి జీవితాన్ని సాహిత్య సేవకే అంకితం చేసిన రచయిత.. పి. చంద్రశేఖర ఆజాద్. నాలుగున్నర దశాబ్దాలుగా అనేక ప్రక్రియల్లో సాహితీసేద్యం చేస్తున్నారు. ఈయన స్వస్థలం గుంటూరు జిల్లా వెల్లటూరు. ఏపీ స్టేట్ ట్రేడింగ్ కార్పొరేషన్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా వీఆర్ఎస్ తీసుకొన్నారు. ఇప్పటివరకూ 850కి పైగా కథలు, 87 నవలలు, 18 నవలికలు, 5000 టీవీ ఎపిసోడ్స్, టెలీ ఫిల్మ్స్ రాశారు. రేడియో, సినిమా, సాహితీ సంస్థల నిర్వహణతోపాటు కొన్ని సీరియల్స్, ఒకటి రెండు సినిమాల్లోనూ కనిపించారు. 2024లో 'మాయా లోకం' నవలకు కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కారం అందుకున్నారు. 'అడవి పూలు' టెలీ ఫిల్మ్ సంభాషణలకు రెండు నంది అవార్డులు అందుకున్నారు. కథ, స్క్రీన్‌ప్లే, సంభాషణలు అందించిన నాలుగు టెలీ ఫిలిమ్స్‌కు మూడు స్వర్ణ నందులు, ఓ వెండి నంది స్వీకరించారు. 'భారతి' పిల్లల సినిమాకు స్వర్ణ నంది దక్కింది. ఇవేకాకుండా.. కళారత్న (హంస), ఉగాది పురస్కారం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి అవార్డులు దక్కించుకున్నారు. సినిమా రంగంతోపాటు బుల్లితెరపై మెరిసినా.. సాహిత్యాన్ని మాత్రం వదలలేదు. ఓపిక ఉన్నంతకాలం రచనలు చేస్తూనే ఉంటానని చెబుతున్నారు చంద్రశేఖర ఆజాద్.